

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

అమర్‌నాథ్ కుటుంబానికి ఆర్థిక సాయం

గతేడాది వైసీపీ కార్యకర్త చేతిలో సజీవ దహనమైన చెరుకుపల్లికి చెందిన బాలుడు అమర్నాథ్‌గౌడ్ కుటుంబసభ్యులను భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం పరామర్శించారు. బాలుడి సోదరి హేమశ్రీకి ఎన్నారై స్వచ్ఛంద సంస్థ జొన్నలగడ్డ వీరయ్యచౌదరి, జొన్నలగడ్డ వేణు, దివ్య మద్దునూరి మిత్రబృందం సమకూర్చిన రూ.4 లక్షల 50 వేల చెక్కును, యూఎస్ఏకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సేకరించిన రూ.3 లక్షల 58 వేల చెక్కును అందజేశారు. కళాశాలలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదువుకుంటున్న హేమశ్రీని అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో హేమశ్రీ కన్నీటి పర్యంతమవగా దగ్గరకు తీసుకుని కలత చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతస్థాయి ఉద్యోగం వచ్చే వరకు కుటుంబానికి అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా ఇచ్చారు.

చదువుకు అండగా..

గతేడాది సెప్టెంబరు 10న చంద్రబాబు అరెస్టు వార్తలను టీవీలో చూస్తూ గుండెపోటుతో యద్దనపూడి గ్రామానికి చెందిన టెక్కెం నాగేశ్వరరావు మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె వివాహం అవ్వగా, చిన్న కుమార్తె డిగ్రీ పూర్తి చేశారు. సివిల్స్‌కు వెళ్లాలన్న తన కోరికను తండ్రి మరణించడంతో విరమించుకోగా, ప్రస్తుతం భువనేశ్వరి ఆమె చదువుకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థికసాయం అంద జేశారు.


యద్దనపూడిలో టెక్కం నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

మొవ్వ సింగారావు కుటుంబానికి..

చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన మొవ్వ సింగారావు గతేడాది అక్టోబరు 12న మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సంపాదన మీదే ఆధారపడి ఆ కుటుంబం బతుకుతోంది. ఈ క్రమంలో భువనేశ్వరి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి రూ.3 లక్షలు అందజేశారు.

కుటుంబ సభ్యుడ్ని కోల్పోయిన మీరు ఎంత బాధలో ఉన్నారో తెలుసు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. టీడీపీ కార్యకర్తలంతా మా కుటుంబ సభ్యులే.. ఏ కష్టమొచ్చిన పార్టీ అండగా ఉంటుంది.. ఏ సమయంలో అయినా మా దగ్గరికి రావచ్చు.. అంటూ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ధైర్యం చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో గతంలో మృతి చెందిన బాధిత కుటుంబాల కష్టాలు వింటూ.. వారి కన్నీళ్లు తుడిచారు. కుటుంబసభ్యుడ్ని కోల్పోయి నీరింకిన కళ్లతో ఉన్న బాధిత కుటుం బాలకు నిజం గెలవాలి యాత్ర ద్వారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో భువనేశ్వరి పర్యటన మంగళవారం జరిగింది. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబు అరెస్టుతో జిల్లాలో చనిపోయిన ముగ్గురూ నిరుపేదలే కావడం, కుటుంబ భారం మోసే వారే తనువుచాలించడంపై ఆమె చలించిపోయారు.


చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి చెక్కును అందిస్తున్న భువనేశ్వరి, ప్రక్కన ఎమ్మెల్యే అనగాని

- అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా
- నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి పరామర్శ
- రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో పర్యటన

రేపల్లె, చెరుకుపల్లి / బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ప్రాణాలొదిలిన మూడు కుటుంబాలను మంగళవారం భువనేశ్వరి పరామర్శించారు. వారికి ధైర్యాన్ని నింపడంతో పాటు ఆర్థికంగా సాయం అందించడానికి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జిల్లాలో పర్యటించారు. చెరుకుపల్లిలో ఒకరు, పర్చూరు నియోజకవర్గం చిననందిపాడు, యద్దనపూడి గ్రామాల్లో ఒక్కొక్కరు గుండెపోటుతో గతేడాది మృతి చెందగా వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆత్మీయ పరామర్శ మనోధైర్యాన్ని ఇచ్చింది. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఆయన అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటు వచ్చి మరణించారని వారి కుటుంబసభ్యులు భువనేశ్వరి ఎదుట కన్నీటి పర్యంతమవగా అండగా ఉంటానని వారి భుజం తట్టి ధైర్యం చెప్పారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. అనంతరం రూ.3 లక్షల చెక్కును వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి అం దజేశారు. భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్న వెంకటేశ్వరరావు కుమారులు సురేష్, రాజేష్ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

నిజం గెలవాలి యాత్ర సాగిందిలా..

గన్నవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నిజం గెలవాలి యాత్ర సాగింది. భువనేశ్వరికి జిల్లా ప్రారంభంలో కార్యకర్తలు ఆహ్వానం పలికారు. చిలుమూరు కర కట్ట పై ఉన్న ఆంజనేయస్వామికి భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. కొల్లిపర మండలం పిడపర్తిపాలెం మహిళలు భువనేశ్వరి వాహన శ్రేణికి ఘనంగా స్వాగతం పలికారు. భువనేశ్వరికి హారతులు ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం చెరుకుపల్లిలోని బాధిత కుటుంబం ఇంటి వద్దకు చేరుకుని వారిని పరామర్శించారు. వెల్లటూరులో మహిళలు అభ్యర్థన మేరకు వాహనం నుంచి బయటకు వచ్చి భువనేశ్వరి అభివాదం చేశారు. దారి పొడవునా మహిళలు ఆమెను చూసేందుకు బారులు తీరారు. చెరుకుపల్లిలో అయితే అపూర్వ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి వెంట మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ బాపట్ల, చీరాల ఇన్‌చార్జులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, టీడీపీ చెరుకుపల్లి మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు, పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


కొల్లూరులో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి ఆనందబాబు


చెరుకుపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి, ఎమ్మెల్యే అనగాని

చేయూత ఏరివేత



- లబ్ధిదారుల తగ్గింపునకు అడ్డదారులు
- కరెంటు బిల్లుల పేరుతో అడ్డగోలుగా కోతలు
- 300 యూనిట్లు దాటించేందుకు పిల్లిమొగ్గలు
- సెప్టెంబరు నుంచి ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం



మంగళగిరికి చెందిన ఓ మహిళకు వలంటీర్ ఫోన్ చేసి మీకు చేయూత ఆగిపోయిందండీ అని చెప్పిం ది. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటడమే కారణ మని చెప్పింది. ఏమిటా అని సచివాలయంలో అడిగితే ఆమె హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో రెండు మీటర్లు చూపిస్తున్నాయని చెప్పారు. ఆ రెండు మీటర్లు కలుపుకున్నా ఆమె కరెంటు బిల్లు 290 యూనిట్లు దాటలేదు. కానీ ప్రభుత్వం మాత్రం 310 యూనిట్లు వచ్చిందని చెప్పి ఆమెకు చేయూత ఆపేశారు. ఏమిటా అని లోతుగా పరిశీలిస్తే ఒక ఏడాదిలో 300 యూనిట్లు దాటిని నెలల సగటు తీసుకుని ఆమె చేయూత ఆపేశారని తేలింది.

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అంతకంతకూ నీరుగార్చడం ధ్యేయంగా ప్రభుత్వం ఏటికేడు మార్పులు, నిబంధనలను కఠినతరం చేస్తోంది. ముందు ఏదో ఒక సాకుతో లబ్ధిదారులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదేదో ఒక పథకానికి పరిమితా అంటే కాదు. అన్ని పథకాల పరిస్థితి ఇలానే ఉంది. ఈ కోవలోకి చేయూత చేరింది. ఏదో ఒకలా లబ్ధిదారులను తొలగిస్తే ఆ తర్వాత వారి ఖర్మం అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందన్న విమర్శలున్నా పాలకులు లెక్క చేయడంలేదు. ఇప్పటికే సంక్షేమ పథకాలకు సవాలక్ష నిబంధనలు పెట్టి లబ్ధిదారులను ఎక్కడికక్కడ దిగ్గోసినా ప్రభుత్వానికి తృప్తి కలిగినట్లుగా లేదు. తప్పుడు పద్ధతుల్లో ఆ నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను భారీగా తగ్గించేపనిలో తలమునకలై ఉంది.

● నిబంధనలు ఇలా.. అమలు ఇలా..

చేయూత అమలుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటరాదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఐటీ చెల్లింపులు చేసి ఉండకూడదు. ఇంట్లో ప్రభుత్వ పింఛను తీసుకునేవారు ఉండకూడదు. ఇంటి స్థలం, పొలం నిర్ణీత విస్తీర్ణాన్ని మించి ఉండకూడదు అంటూ ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. వాటిని అమలు చేసిన కారణంగా గత మూడు దఫాల్లోనే చాలామంది చేయూత పథకానికి అనర్హులుగా మారిపోయారు. ఈసారి లబ్ధిదారులను ఏరివేసేందుకు అవకాశం దొరకలేదు. దీంతో అడ్డదారుల్లో నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను మోసం చేస్తోంది. ఆరునెలల విద్యుత్ వినియోగ సగటు 300 యూనిట్లు దాటరాదన్న నిబంధనను తప్పుడు దారిలో అన్వయిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఆరు నెలల సగటు కాకుండా, మొత్తం విద్యుత్ వినియోగంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించిన నెలలు ఎంచుకుని ఆ సగటును చూపించి లబ్ధిదారులను తొలగిస్తోంది. గతంలో ఏనాడో కారు కొని ఉండి అది ఇప్పుడు అమ్ముకుని ఉన్నా, కారు లేదన్న విషయాన్ని పక్కకు పెట్టి లబ్ధిదారులను తొలగిస్తున్నారు. ఐటీ విషయంలో కూడా ఇదే జరుగుతోంది. గృహరుణం కోసం గతంలో ఏనాడో చెల్లించిన ఐటీ చెల్లింపులు, ఐటీ కట్టినవారు రేషన్ కార్డులో ఉన్నారనే కారణంతో చాలా మందికి చేయూత ఆపేశారు. చేయూత లబ్ధి పొందే మహిళ సోదరుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడనో, తండ్రి విశ్రాంత ఉద్యోగ పింఛను తీసుకుంటున్నాడనో, ఐటీ చెల్లించాడనో పెళ్లై వేరే కుటుంబంలోకి వెళ్లిపోయిన మహిళలకు కూడా పింఛను తొలగిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

ఫిబ్రవరి వచ్చినా ఊసేలేని పథకం

ఆది నుంచి చేయూత పథకాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూనే వస్తోంది. 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పేరుతో హడావుడి చేసింది. అయితే 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించలేదు. 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం 2022 సెప్టెంబరు 23 వరకూ మూడో దఫా చేయూత అందించలేదు. అంటే 2021 తర్వాత మరో 16 నెలలకుగానీ లబ్ధిదారులకు చేయూత దక్కలేదు. కాగా కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదు. అక్టోబరులో ఇస్తారన్న చేయూత, జనవరిలో కూడా ఇవ్వలేదు. తాజాగా ఫిబ్రవరి అంటున్నారు. అదైనా అమలవుతుందో లేదో తెలియని పరిస్థితి. ఎన్నికల కోడ్ సమీపిస్తోన్న నేపథ్యంలో ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తోందా అన్న అనుమానాలు లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

ఒక సారి ఆగిపోతే ఇక అంతే..

ప్రభుత్వం ఏదో ఒక మెలిక పెట్టి ఒకసారి పథకానికి అనర్హులుగా చేస్తే ఇక వారికి పథకం అందడం దాదాపు అసాధ్యమే! తమ వద్ద ఆధారాలు ఉన్నా, ఎంపిక విధానంలో లోపమున్నా లబ్ధిదారులు చేయగలిగిందేమీ లేదు. కావాలంటే సచివాలయానికి వెళ్లి ఆధారాలతో ఒక అభ్యర్థన పెట్టుకోవచ్చు. కానీ దాన్ని పరిశీలించి పరిష్కరించే అధికారం, అవకాశం ఏ ఒక్కరికీ లేదు. క్షేత్ర స్థాయిలో ఉండే గ్రామ, వార్డు సంక్షేమ అధికారి మొదలు, ఎంపీడీవో, డీఆర్‌డీఏ పీడీ వరకూ ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో అనర్హత బారిన పడిన లబ్ధిదారుల గోడు వినేవారే లేకుండా పోయారు.

స్మార్ట్ టౌన్‌షిప్‌లు కలేనా?

- భూసేకరణకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- లేఅవుట్‌లు ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం
- నవులూరు మినహా పట్టణాల్లో గజం కూడా సేకరించింది లేదు
- మిధ్యగానే మధ్యతరగతికి స్థలాలు

నవులూరు వద్ద స్మార్ట్ సిటీ నమూనా చిత్రం


పట్టణాలు, శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అల్పాదాయ వర్గాల వారు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోవడం కలగానే మిగులుతోంది. ఈ నేపథ్యంలో మిడిల్ ఇన్‌కం గ్రూప్(ఎంఐజీ) జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశ పెట్టింది. ఇందులో ప్రభుత్వమే భూమి కొనుగోలు చేస్తుంది. అసైన్డ్ భూమి ఉంటే సేకరిస్తుంది. లేఅవుట్ రూపొందిస్తుంది. ఇరవై ఏళ్లు క్రితం ఐడీఎస్ఎంటీ పేరుతో ఇలాంటిది అమలైంది. పాత పథకాన్నే తిరిగి ప్రభుత్వం ప్రవేశ పెట్టినప్పటికి నేటివరకు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అమలు చేయడాన్ని విస్మరించింది. మధ్యతరగతికి స్థలాలు మిధ్యగానే మిగిలిపోయాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మధ్యతరగతికి స్థలాల పంపిణీ ముందడుగు పడటంలేదు. పట్టణాల వారీగా అధికారులు ప్రభుత్వానికి భూమిని సేకరించడానికి ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు కొన్ని పట్టణాల్లో గజం స్థలం కూడా సేకరించలేదు. రాజధాని ప్రాంతంలో మినహా మరెక్కడా స్థలాలు లేవు. భూమిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఈ లేఅవుట్లు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అథారిటీల వారీగా స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటివరకు నిధుల విడుదలకు అతీగతి లేదు. దీంతో భూసేకరణ నిలిచిపోయింది.

మూడేళ్ల కిందటే ఆదేశాలు..

ప్రభుత్వం ఎంఐజీ వారికి స్థలాలివ్వాలని 2020 సంవత్సరంలో అధికారులకు ఆదేశాలిచ్చింది. అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మునిసిపాల్టీల పరిధి లో స్థలసేకరణ చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు ఒక్కచోట కూడా కొలిక్కిరాలేదు. రెవెన్యూ సహకారం తో స్థలాలను సేకరించి లేఅవుట్‌లు ఆమోదం తీసుకొనే బాధ్యతలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు అప్పగించింది. సంబంధిత అధికారులు స్థలసేకరణ అంశాన్ని రెవెన్యూ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందనలేదు. నిబంధనల ప్రకారం పట్టణానికి అయిదు కిలోమీటర్ల లోపునే భూమిని సేకరించాల్సి ఉంది. అదీ కూడా ఎకరం రూ.కోటిన్నర లోపు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ విధంగా పట్టణాలకు చుట్టుపక్కల భూమి లభ్యం కావడంలేదు. అత్యధిక ధరతో కొనుగోలు చేస్తే ఆ భారం లబ్ధిదారులపై పడుతోంది.

మునిసిపాలిటీల వారీగా డిమాండ్...

అన్ని పట్టణాల పరిధిలో పది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. 150, 200, 240 గజాలుగా ప్లాట్లను విభజిస్తారు. లేఅవుట్‌లో రహదారులు, కాలువలు, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తుంది. రిజర్వ్ స్థలంలో ప్రజావసరాల కోసం బడి, గుడి వంటివి నిర్మిస్తుంది. అనంతరం దరఖాస్తులు స్వీకరిస్తుంది. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎవరైనా ఇందుకు అర్హులే. లేఅవుట్ ఆమోదం అనంతరం దరఖాస్తుదారులను ఎంపిక చేయాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో స్థలాల డిమాండ్‌ను సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ మేరకు మునిసిపాల్టీల వారీగా ప్లాట్ల డిమాండ్‌ను నిర్ధారించారు. దాదాపు 28,416 ప్లాట్లు అవసరం ఉందని గుర్తించారు. నరసరావుపేట మునిసిపాల్టీలో 1864 ప్లాట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సదరు అధికారులు సిద్ధం చేశారు. అలాగే చిలకలూరిపేట 651 ప్లాట్లు, మాచర్ల 108, సత్తెనపల్లి 346, వినుకొండ 608, పిడుగురాళ్ల 482, దాచేపల్లి 56, గురజాల 21, బాపట్ల 3171, గుంటూరు 9614, మంగళగిరి 1344, పొన్నూరు 531, రెపల్లే 1066, తాడేపల్లి 2065, తెనాలి 2962, అద్దంకి 1104, చీరాల 2095 ప్లాట్లు అవసరం ఉందని నిర్ధారించారు. ఈ మేరకు అర్బన్ అథారిటీలు భూమి సేకరణకు ప్రతిపాదనలు రూపొందించాయి. రాజధాని పరిధిలో మంగళగిరి నియోజకవర్గం నవులూరులో గజం రూ.17,499గా నిర్ణయించి దరఖాస్తులను స్వీకరించారు. ఇక్కడ మినహా మరెక్కడా అమలు జరగలేదు. ఈ ప్రక్రియ దాదాపు అటకెక్కినట్లే. పథకం అమలు లక్ష్యం ఘనంగా ఉన్నా ఆచరణ మాత్రం శూన్యమని చెప్పవచ్చు.

ఆచితూచి అడుగులు

- చీరాల, పర్చూరుల్లో ఆ నేత ద్విపాత్రాభినయం
- అక్రమార్జనకు గండిపడకుండా.. అధిష్ఠానం ఆగ్రహానికి గురికాకుండా...

చీరాల, జనవరి 30: వైసీపీకి చెందిన ఆ నేత చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభినయం చేస్తున్నారు. రాజకీయంగా భిన్న ప్రకటనలు చేయటంతో పార్టీ అధిష్ఠానం దృష్టి ఆ నేతపై పడటంతో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అక్రమ సంపాదనకు గండిపడకుండా ఒకవైపు, అధిష్ఠానం ఆగ్రహానికి గురికాకుండా మరోవైపు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఎన్నికలనోటిఫికేషన్ వెలువడే దాకా సంయమనం పాటిస్తే ఆ తర్వాత తనదారి తాను చూసుకున్నా ఇబ్బంది ఉండదనే ఆలోచన చేస్తున్నట్లు వినికిడి.

చీరాలలో బస్సుయాత్ర నుంచి..

ఇటీవల చీరాలలో వైసీపీ బస్సుయాత్ర జరిగిన రోజు నుంచి ఆ నేత పార్టీ పెద్దలను పలుమార్లు కలిశారు. తొలిసారి కలిసిన తర్వాత ముఖ్య అనుచరులతో ఆంతరంగిక సమావేశం నిర్వహించారు. తాను చీరాల నుంచే పోటీ చేస్తానని అందులో స్పష్టం చేశారు. చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్ అని బస్సు యాత్రలో నేతలు ప్రకటించారు. దీంతో ఆ నేత అదేరోజు పార్టీ పెద్దల ముందు తన పంచాయితీ పెట్టారు. గత ఒప్పందాలను అమలు చేయాలని లేదంటే తన నిర్ణయం తాను తీసుకుంటానని చెప్పినట్లు అనుచరగణం ప్రచారం చేసింది.

భరత్ ఎంట్రీతో పునరాలోచన

కాగా ఆ నేత నిర్వహించిన ఆంతరంగిక సమావేశ సారాంశం తెలుసుకున్న సీఎం జగన్ ఆదేశాల మేరకు గతంలో పర్చూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గొట్టిపాటి భరత్‌కు సీఎంవో నుంచి వర్తమానం వెళ్లింది. భరత్ సీఎం జగన్‌ను కలిశారు. దీంతో ఆ నేత పునరాలోచనలో పడ్డారు. వెంటనే విజయసాయిరెడ్డిని కలసి తాను పర్చూరు నుంచే పోటీ చేస్తానని, అయితే తనకు మొదట్లో చెప్పిన మాటలను పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. తన సూచనలను పరిగణనలోకి తీసుకోకుంటే పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. పార్టీ మారే ఆలోచన ముందస్తుగా తెరపైకి వస్తే పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు పరంపరగా వస్తున్న అక్రమార్జనకు గండి పడుతుంది. దాంతో పాటు అధిష్ఠానం ఆగ్రహానికి కూడా గురికావాల్సి వస్తుంది.

త్యాగజీవి.. మహాత్మాగాంధీ

కలెక్టర్ పి.రంజిత్‌బాషా నివాళి

బాపట్ల, జనవరి 30: స్వేచ్ఛా వాయువులతో జాతి అభివృద్ధి చెందాలని మహాత్మాగాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు మననం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి మహాత్ముడి చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అహింసావాద మార్గంలో ఏదైనా సాధించగలమని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అన్నారు. స్వాతంత్ర్యం కొరకు ప్రజలందరినీ చైతన్య పర్చడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఆర్డీవో గంధం రవీందర్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఏవో కె.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పీజీ డిప్లొమాలు



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'రూరల్ డెవలప్‌మెంట్(గ్రామీణాభివృద్ధి)' ప్రధానాంశంగా వీటిని రూపొందించారు. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పర్సనల్ ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్‌లను తప్పనిసరిగా తెలపాలి. ప్రోగ్రామ్ మొదటి ట్రైమెస్టర్‌లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది.

పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం-ఆర్ఎం): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. క్యాట్/ ఎక్స్ఏటీ/మ్యాట్/ సీమ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో చూపిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** ఏడాదికి రూ.2,20,500
- **భోజన, వసతి ఖర్చులు:** ఏడాదికి రూ.1,11,000
- **కాషన్ డిపాజిట్:** రూ.10,000
- **సీట్ రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.20,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in

కొమెడ్‌కె యూజీఈటీ నోటిఫికేషన్

కన్సార్షియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటి కోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www. comedk.org

ఏఐఐఏలో పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు ఉంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సును ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధిస్తారు. కోర్సులో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు చివరలో థియరీ అండ్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. దీనిని హెల్త్‌కేర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎస్ఎస్‌సీ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి హెచ్ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థలు, ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, పంచకర్మ సెంటర్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 16 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** https://aiia.gov.in

దిక్సూచి DIKSUCHI

జాబ్ కార్నర్

ఎన్‌డీఏలో గ్రూప్ 'సి' పోస్టులు

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కింద పేర్కొన్న గ్రూప్ 'సి'(బ్యాక్‌లాగ్ సహా) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 198

1. లోయర్ డివిజన్ క్లర్క్: 16 పోస్టులు
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: 1
3. డ్రాఫ్ట్స్‌మన్: 2
4. సినిమా ప్రొజెక్షనిస్ట్-2: 1
5. కుక్: 14
6. కంపోజిటర్-కమ్ ప్రింటర్: 1
7. సివిలియన్ మోటార్ డ్రైవర్ (ఓజీ): 3
8. కార్పెంటర్: 2
9. ఫైర్‌మన్: 2
10. టీఏ - బేకర్ అండ్ కాన్ఫెక్షనర్: 1
11. టీఏ - సైకిల్ రిపేరర్: 2
12. టీఏ - ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్: 1
13. టీఏ - బూట్ రిపేరర్: 1
14. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రెయినింగ్: 151

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://ndacivrect.gov.in/

నాల్కోలో జూనియర్ ఫోర్‌మెన్

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఎల్‌సీఓ)....కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 42

1. జూనియర్ ఫోర్‌మన్(షార్ట్ ఫైర్ బ్లాస్టర్): 2 పోస్టులు
2. జూనియర్ ఫోర్‌మన్(ఓవెర్‌మన్/మైన్స్): 18
3. జూనియర్ ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): 5
4. జూనియర్ ఫోర్‌మన్(సర్వేయర్): 5
5. జూనియర్ ఫోర్‌మన్(సివిల్): 2
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-3: 2
7. డ్రెస్సర్ కమ్ ఫస్ట్ ఎయిడర్: 4
8. నర్స్ గ్రేడ్-3: 4

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, హెచ్ఎస్సీ, డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్/మైనింగ్, మైనింగ్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18

దరఖాస్తు ఫీజు: రూ.100

వెబ్‌సైట్: https://nalcoindia.com

The Secret of Work National Level Scholarship Test

SCHOLARSHIP ALERT

Description: The Secret of Work National Level Scholarship Test 2024 is a competition organised by the Aaryajanani Trust (NGO) in association with Ramakrishna Math, for all youth aged between 18 and 30, regardless of qualifications or nationality.

Eligibility: Open for students aged between 18 to 30 years.

Prizes & Rewards: Up to 50,000 (one-time)

Last Date to Apply: 15-02-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/SWRN1

Narotam Sekhsaria Scholarship Programme

Description: Narotam Sekhsaria Scholarship Programme 2024 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation (a non-profit organisation set up by an endowment from Mr. Narotam Sekhsaria) to financially support meritorious Indian students who are willing to pursue higher studies from top-ranking institutions in India and abroad.



Eligibility: Open for Indian citizens under 30 (as of January 31st, 2024) who have completed or are nearing completion of their graduate degree from an accredited Indian university. Applicants must have enrolled in postgraduate degrees at top institutions in India or abroad, starting Fall 2024. Even applicants awaiting university acceptance can apply, but the scholarship is conditional upon securing admission.

Prizes & Rewards: Interest-free scholarship loan and mentorship guidance.

Last Date to Apply: 14-03-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/NSP6

National Institute of Public Co-operation and Child Development Internship

Description: National Institute of Public Cooperation and Child Development Internship 2024 is an opportunity offered by the National Institute of Public Cooperation and Child Development (NIPCCD), New Delhi, for postgraduate and research students. This programme aims to familiarise interested and motivated students with the overall process of training and research in Women & Child Development schemes and programs.

Eligibility: Open for postgraduate or research students pursuing studies at various universities and recognized research institutes.

Prizes & Rewards: A monthly honorarium of up to 5,000 and other incentives

Last Date to Apply: 31-03-2024

Application mode: via email or post to: NIPCCD, Coordination Unit, 5 Siri Institutional Area, Hauz Khas New Delhi - 110016 Email ID: punipccd@gov.in

Short Url: www.b4s.in/aj/NIPC1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yUaTypSలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పద్మశ్రీ అవార్డ్ విజేతలకు చిరు సత్కారం

పద్మశ్రీ పురస్కారం పొందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి ఎ.వేలు ఆనందాచారిలను పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత మెగాస్టార్ చిరంజీవి సోమవారం తన ఇంట్లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న యక్షగాన కళారూపానికి జీవం పోస్తున్న సమ్మయ్యకు పద్మశ్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిత్తూరు జిల్లా వెన్నంపల్లికి చెందిన ఆనందాచారి స్థపతిగా దేవాదాయశాఖలో పనిచేశారు. అనేక ఆలయ నిర్మాణాలకు శిల్పకళా నైపుణ్యాన్ని అందించారు. శిల్పశాస్త్ర విషయాలను శిల్పకళాకారులకు నేర్పిస్తూ ఆయన చేస్తున్న సేవలను చిరంజీవి కొనియాడారు. ఇలాంటి కళారూపాలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిరంజీవిని సమ్మయ్య, ఆనందాచారి కూడా సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను కాపాడాలని ఇరువురూ కోరారు.

సెప్టెంబర్‌లో ఓజీ రాక

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 27న 'ఓజీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది.



1950ల నాటి ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గతంలో పవన్ కల్యాణ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'అత్తారింటికి దారేది' చిత్రం కూడా సెప్టెంబర్ 27న విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కూతురు భవతరిణి ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. నటుడు మంచు మోహన్‌బాబు ఇళయరాజా ఇంటికి వెళ్లి ఆయన్ను ఓదార్చారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన సోషల్ మీడియాద్వారా తెలిపారు.

మనసుల్ని కదిలించే సినిమా ఇది



'ఈ సినిమాకోసం ఎక్కువరోజులు ప్రిపేర్ అయ్యాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. కథతో కనెక్ట్ అవ్వడానికి సీన్స్ మళ్లీ మళ్లీ ప్రాక్టీస్ చేశాను. పాత్ర కోసం రెండు సార్లు గుండు గీయించుకున్నాను. నా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మంచి ఫలితం వస్తుందని ఆశగా ఉన్నాను. అన్నారు హీరో సుహాస్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు'. శివాని నాగారం కథానాయిక. దుష్యంత్ కటినేని దర్శకుడు. వెంకటేశ్ మహా, ధీరజ్ మొగిలినేని కలిసి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో ముచ్చటించారు. 'దుష్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. రియల్‌లైఫ్‌లో తను చూసిన కొన్ని సంఘటనల స్ఫూర్తి ఈ కథలో ఉంది. లాక్‌డౌన్ టైమ్ కాబట్టి స్క్రిప్ట్‌ను బాగా స్టడీ చేసే అవకాశం దొరికింది. కథ మీద నమ్మకంతోనే గుండు గీయించుకున్నా. 2007లో జరిగే కథ ఇది. ఇంటర్వెల్ ఇరవై నిమిషాల ముందు వరకు సరదాగా సాగుతుంది. అక్కడ్నుంచి వేరే లెవల్‌కు వెళుతుంది. సెకండాఫ్ మొత్తం ఎమోషనల్ ఫీల్. 'కలర్ ఫొటో'ను మించిన హై ఎమోషన్ ఈ కథలో ఉంటుంది' అని చెప్పారు సుహాస్. ఇంకా మాట్లాడుతూ 'మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ. నేను, శరణ్య కవలలం. మాఇద్దరి పుట్టినరోజున జరిగిన సంఘటనలు మీ జీవితాలను ఎలాంటి మలుపు తిప్పాయి అనేది ఈ మూవీలో కీలకంగా ఉండే అంశం. కథలోని చాలా సీన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి. వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఫైనల్ కాపీ చూశాక సినిమాపై నమ్మకం కుదిరింది. ముఖ్యంగా శేఖర్‌చంద్ర నేపథ్య సంగీతం సినిమాను మరో రేంజ్‌కి తీసుకెళ్లింది. ఇందులో కథానాయికగా పరిచయం అవుతున్న శివానికి మంచి ఫ్యూచర్ ఉంది. మంచి నటి తను. సినిమా విషయంలో మేమంతా కాన్ఫిడెంట్‌తో ఉన్నాం. ఫిబ్రవరి 2న అందరూ థియేటర్‌కెళ్లి చూడాలని కోరుకుంటున్నా' అన్నారు సుహాస్.

'సంఘీ' తప్పుడు పదమని నా కూతురు అనలేదు

రజనీకాంత్



"సంఘీ' అనేది ఎవరి వ్యక్తిత్వాన్నీ కించపరిచే పదం కాదు, ఎవరినో అవమానించాలనే ఆలోచన నా కూతురు ఐశ్వర్యకు లేదు" అని రజనీకాంత్ అన్నారు. ఇటీవలే జరిగిన 'లాల్‌సలామ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో ఐశ్వర్య 'నా తండ్రి సంఘీ కాదు' అంటూ ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలను రజనీకాంత్ సమర్థించుకున్నారు. ఆ చిత్రం ఆడియో ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. నా తండ్రి సంఘీ అయి ఉంటే 'లాల్‌సలామ్' లాంటి సినిమా చేసుండేవారు కాదు. ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు' అని ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. హిందుత్వ వాదాన్ని బలపరచడం తప్పు ఎలా అవుతుంది అని నెటిజన్లు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న 'వేట్టైయాన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న రజనీకాంత్ ఈ వివాదంపై మీడియా ముందు స్పందించారు. 'నా కూతురు ఎక్కడా తప్పుగా మాట్లాడలేదు. 'సంఘీ' అనేది తప్పుడు పదం అని తను చెప్పలేదు. తన తండ్రిని ఆ ఉద్దేశంతో చూడొద్దు అని మాత్రమే చెప్పింది. 'ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తిని అలాంటి దృష్టితో ఎందుకు చూస్తున్నారు' అని ప్రశ్నించడం ఆమె ఉద్దేశం'అని చెప్పారు. 'లాల్‌సలామ్' సినిమాకు ఐశ్వర్య దర్శకురాలు కావడం వల్ల ఆ సినిమాకు ప్రచారం కల్పించేందుకే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారా అని విలేకరులు అడగ్గా అలాంటి అవసరం తమకు లేదని కొట్టిపారేశారు. ఫిబ్రవరి 9న 'లాల్ సలామ్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఇల్లు కొందామనుకున్న డబ్బు ఈ సినిమాలో పెట్టా

సొహైల్



'పాషా లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం. సినిమా అంటే ప్యాషన్‌తో చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా తీశారు. సగం సినిమా పూర్తయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పుడు మా నాన్న రిటైర్‌మెంట్ పైసలు, ఇల్లు కొందామని నేను దాచుకున్న డబ్బు ఈ సినిమాకు పెట్టా. నిర్మాత దిల్‌రాజుగారికి మా పరిస్థితి చెబితే 'తెలంగాణ నేను చూసుకుంటా. నువ్వు టెన్షన్ పడొద్దు' అని ధైర్యం చెప్పారు. ఆయనకు నా కృతజ్ఞతలు' అన్నారు 'బిగ్‌బాస్' సొహైల్. ఆయన హీరోగా నటించిన 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన చాలా ఎమోషనల్ అయ్యారు. 'మనం జీవితంలో ఓడినా గెలిచినా ఏ తల్లికీ కొడుకు మీద ప్రేమ పోదు. అదే ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. ఇందులో ఫన్ ఎమోషన్ ఉంది. హీరోయిన్ మేఘలేఖ చక్కగా నటించడమే కాకుండా మా పరిస్థితిని అర్థం చేసుకుని సపోర్ట్‌గా నిలిచారు. దయచేసి ఈ సినిమాను థియేటర్‌లోనే చూడాలని అందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నాను' అన్నారు సొహైల్. చిత్ర దర్శకుడు శ్రీకోనేటి మాట్లాడుతూ 'కథ దగ్గర నుంచి సినిమా తయారయ్యే వరకూ ఈ ప్రయాణంలో బెక్కం వేణుగోపాల్ ఎంతో సహకరించారు. సొహైల్ ఈ సినిమాను తన భుజాల మీద వేసుకుని నడిపించారు. వినోదంతో పాటు మంచి భావోద్వేగం ఉన్న చిత్రమిది' అని చెప్పారు. సొహైల్ ఇమేజ్‌కి తగ్గ కథను ఎన్నుకున్నామనీ, యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దామనీ బెక్కం వేణుగోపాల్ చెప్పారు. సొహైల్‌కు సినిమా అంటే చాలా ఇష్టం. అతనితో ఈ చిత్రం నిర్మించడం గర్వంగా ఉందని నిర్మాత పాషా చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోలు మంచు మనోజ్, సందీప్ కిషన్, రోషన్ కనకాల, విరాజ్ అశ్విన్, బ్రహ్మానందం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొని చిత్రం విజయం సాధించాలని కోరారు.

ముహూర్తం కుదిరింది



'అంటే సుందరానికి' లాంటి హిట్ చిత్రం తర్వాత నాని - దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో వస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నానికి జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుతారు

అపూర్వరావ్



'హ్యాపీ ఎండింగ్ ప్యూర్ యూత్‌ఫుల్ మూవీ. ఇందులో హ్యూమర్‌కి కొదవుండదు. ప్రతి పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుకుంటారు' అంటున్నారు కథానాయిక అపూర్వరావ్. 'హ్యాపీ ఎండింగ్' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నారు. యష్ పూరి హీరోగా, కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అపూర్వరావ్ విలేకరులతో మాట్లాడారు. 'మా నేటివ్ ప్లేస్ ఒంగోలు. నాకు నటనంటే పిచ్చి. ఇంట్లోవాళ్ల సహకారం లేదు. ఇక పట్టుబట్టి, వాళ్లను ఒప్పించి హైదరాబాద్‌లో దాదాఫాల్కే ఫిల్మ్‌స్కూల్‌లో జాయినై ట్రైనింగ్ తీసుకున్నాను. ఆ టైమ్‌లో పరిచయమైన కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, వాళ్ల కామన్ ఫ్రెండ్స్ ద్వారా 'హ్యాపీ ఎండింగ్' ఆడిషన్స్‌కు వెళ్లే అవకాశం వచ్చింది. బాగా పర్‌ఫార్మ్ చేసే తెలుగమ్మాయి కోసం చూస్తున్న వాళ్లకు నేను నచ్చాను. అలా ఈ సినిమాలో అవకాశం దొరికింది. ఒక మంచి ఎంటర్‌టైనర్ ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/H8CWAn4 లో చదవండి.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

సాగు చేసుకోలేక భూములివ్వలేదు

- ప్రభుత్వం అడిగితే రాష్ట్ర రాజధాని కోసం ఇచ్చాం
- మూడు ముక్కల ఆటతో నట్టేట ముంచాలని చూస్తే మట్టి కొట్టుకుపోవటమే
- 1505వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 30: సాగు చేసుకోలేక మూడు పంటలు పండే భూములివ్వలేదని, ప్రభుత్వం రాష్ట్ర రాజధాని కోసం అడిగితే 33వేల ఎకరాలు ఇచ్చామని రాజధాని అమరావతి రైతులు పేర్కొన్నారు. మూడు రాజధానుల మూడు ముక్కల ఆటతో నట్టేట ముంచాలని చూస్తే పాలకులు మట్టి కొట్టుకుపోతారన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1505వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, ప్రభుత్వం మారినంత మాత్రాన చట్ట ప్రకారం చేసుకున్న ఒప్పందాలు రద్దు కావన్నారు. హైకోర్టు కూడా అమరావతిని అభివృద్ధి చేయాలనే చెప్పిందన్నారు. కానీ సీఎం జగన్‌రెడ్డి చట్టాలను అమలుచేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేయాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసం విశాఖ రాజధాని అంటున్నాడన్నారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానులు ఏపీలో రుద్దటం అవివేకమన్నారు. రాష్ట్ర సంపద అమరావతిని కాపాడుకుంటామన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్న

- ఎమ్మెల్యే సత్యప్రసాద్

వేమూరు, జనవరి 30: మహోన్నత వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కొనియాడారు. మంగళవారం రాత్రి బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని బలిజేపల్లిలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ జరిగిన సభకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. సభలో సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుండి ఎగసిపడిన రాజకీయ కెరటం లచ్చన్న అన్నారు. జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మద్రాసు రాష్ట్రం నుండి రావలసిన ఆస్థుల పంపకాలను పరిశీలించిన సభ్యుల్లో ఒకరుగా లచ్చన్న ఉండడం ఆంధ్రులైన మనందరం గర్వించదగ్గ విషయం అన్నారు. జైలు జీవితం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలలో చురుకైన పాత్ర, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా నడిపిన ఉద్యమాలు ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయనను మహనీయుడిగా నిలబెట్టాయన్నారు. గ్రామంలో లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ చూపిన కోగంటి బాలగంగాధర్(విశ్వం)ను సత్యప్రసాద్, ఆనంద బాబులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనురాధ, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, టీడీపీ నాయకులు డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ టీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు సాంబశివరావు, దొప్పలపూడి రవి, పార్టీ నాయకులు అమర్తలూరు చింతయ్య, గౌడ సంఘం నాయకులు, టీడీపీ, జనసేన పార్టీల వివిధ విభాగాల శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పార్టీల శ్రేణులు అతిథులకు బైక్ ర్యాలీ ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం చేశారు.


బలిజేపల్లిలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్, మాజీ మంత్రి ఆనందబాబు

హోమ్ ఓటింగ్ విధానంపై అవగాహన పెంచాలి

- రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్

బాపట్ల, జనవరి 30: హోమ్ ఓటింగ్ విధానం త్వరలో అమలులోకి రానుందని, ఈ విధానం అమలుపై అధికారులు జాగ్రత్త వహించాలని ఎన్నికల కమిషన్ అదనపు సీఈవో, రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జిల్లాస్థాయి నోడల్ అధికారుల శిక్షణా కార్యక్రమం మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగింది. తదుపరి ఈవీఎం గోదాంల భద్రత, సీసీకెమెరాల పనితీరు, సంబంధిత దస్త్రాల నిర్వహణను కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన విధానంపై ఓటర్లకు విస్తృత అవగాన కలిగించాలని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సమస్యలు ఉత్పన్నం కాకుండా నోడల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో తప్పులు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా స్పష్టం చేశారు. ఎన్నికల కంట్రోల్ రూమ్, వెబ్‌సైట్‌ల నిర్వాహణపై అవగాహన ఉండాలన్నారు సమావేశంలో అడిషనల్ ఎస్పీ పీ మహేష్, డీఆర్‌వో పీ వెంకటరమణ, ఆర్డీవో గంధం రవీందర్, డ్వామా పీడీ డాక్టర్ బీ అర్జునరావు, ఏవో కే గోపికృష్ణ, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు కృష్ణ కాంత్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల మార్కెట్‌యార్డులో ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్, కలెక్టర్ రంజిత్‌బాషా

నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలి

- జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

కొల్లిపర, జనవరి 30: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదం వలన సుమారు రూ.80కోట్ల నుంచి రూ.100కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తుందన్నారు. నష్టపోయిన రైతుల పక్షాన జనసేన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు పసుపును నిల్వ పెట్టుకునేందుకు ఏ మండలానికి ఆ మండలంలో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కొల్లిపర మండలంలో అనేక కార్యక్రమాల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు తెలిపారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా మంచి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, పెరికల రాంబాబు, బొంతు హరి కృష్ణ, నీలం పూర్ణ, పసుపులేటి మురళికృష్ణ, బండారు రవి కాంత్, దివ్వెల మధుబాబు, గుంటూరు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ మనోహర్

క్రోసూరులో అగ్ని ప్రమాదం

- 250 క్వింటాళ్ళ గుడ్డి పత్తి దగ్ధం
- రూ 18 లక్షల నష్టం

క్రోసూరు, జనవరి 30: క్రోసూరులో కూరపాటి సైదాకు చెందిన పత్తి గోడౌన్ మంగళవారం అగ్ని ప్రమాదానికి గురైంది. గోడౌన్‌లో ఉన్న 250 క్వింటాళ్ళ గుడ్డి పత్తి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. నష్టం రూ.18లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలియ జేశారు. కూరపాటి సైదా గుడ్డి పత్తి, పాత ఇనుము వ్యాపారం చేస్తూ ఉంటాడు. క్రోసూరు సెంటర్‌లో తన ఖాళీ స్థలంలో పత్తితో పాటు పాత ఇనుప సామాన్లను కూడా నిల్వ చేశాడు. ఈ క్రమంలో హఠాత్తుగా మంటలు చెలరేగి పత్తి గోడౌన్‌తో పాటు ఇతర సామాన్లు కూడా దగ్ధమయ్యాయి. కూరపాటి సైదాకు చెందిన నివాస గృహం కూడా పాక్షికంగా దెబ్బతిన్నది. స్థానికంగా ఓ వ్యక్తి అంతిమయాత్ర సందర్భంగా బాణసంచా కాల్చటంతో తారా జువ్వ గోడౌన్‌పై పడిందని కొందరు, షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని మరి కొందరు కారణాలుగా చెపుతున్నారు. క్రోసూరు, సత్తెనపల్లి కేంద్రాలకు చెందిన అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పివేశాయి. క్రోసూరు నడిబొడ్డున అగ్ని ప్రమాదం సంభవించటంతో చుట్టుపక్కల షాపులవారు, గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించటం వల్ల ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. రెవెన్యూ అధికారులు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.


తగలబడుతున్న పత్తి గోడౌన్

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), జనవరి 30: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ నందు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ కె.పద్మజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉన్న 21 సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో ప్రవేశంకోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 23లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2011 నుంచి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ బీసీ-సీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. సంబంధిత జిల్లాలో విద్యార్థులు 3వ తరగతి, 4వ తరగతి 2023-24 సంవత్సరాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో పూర్తిచేసి ఉండాలి. అదేవిధంగా తండ్రి, సంరక్షకుని సంవత్సర ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకోసం https:// apbra gcet. ap cfss.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని జిల్లా కో ఆర్డినేటర్ సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పుతో వైసీపీ నాయకులు సిగ్గుపడాలి

పెదకూరపాడు, జనవరి 30: సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగిలిందన్నారు. చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టినవి తప్పుడు కేసులని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడు తూ ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సీలు పార్టీని వీడుతున్నారని, పార్టీలో జగన్ తన ఆధిపత్యాన్ని కాపాడుకోవటానికి ఎమ్మెల్యేలను, ఎంఎల్‌సీలను పావులుగా వాడుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని, అధికారంలోకి వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు.

అధికార పార్టీ, పోలీసుల వేధింపులతోనే

దుర్గారావు ఆత్మహత్య

- మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అర్జున

విజయపురిసౌత్, జనవరి 30: అధికారపార్టీ, పోలీసుల వేధింపులతోనే వెల్దుర్తి మండలంలో మత్స్యకారుడు దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడని మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడితి అర్జున అన్నారు. మంగళవారం మండలంలోని విజయపురిసౌత్‌లో దుర్గారావు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. చేపల వేటతో జీవించే నిరుపేద కుటుంబాలపై కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు. దుర్గారావు మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మృతుని కుటుంబసభ్యులను ఫోన్లో పరామర్శించారు. కార్యక్రమంలో రమేష్, కొప్పుల రవీంద్ర, రామ్ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, సింహాచలం, నేరేటి వీరాస్వామి యాదవ్, వజ్రం నాయక్, గుండాల శ్రీను, జనసేన అధ్యక్షుడు రాహుల్, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, ఆడెపు కోటయ్య, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అర్జున


గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,30,851 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,25,366 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయమార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 72,581 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	14000	14000
334	9500	20000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు.5	12000	20000	తేజ	8000	20500
273	12500	15500	బ్యాడిగి	9500	19700
341	9500	19500	దేవనూరుడీలక్స్	11000	19000
4884	13500	17500	తెల్లకాయలు	5000	13000

వివాహిత అనుమానాస్పద మృతి

బెల్లంకొండ, జనవరి 30: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గి మండలం కొలగుంట్ల గ్రామానికి చెందిన జ్యోతికి సుమారు ఆరు సంవత్సరాల క్రితం బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన ఓర్చు సురేష్‌తో వివాహమైంది. భార్య భర్తల మధ్య కొన్ని రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో జ్యోతి కడుపు నొప్పితో మృతి చెందినట్టు భర్త సురేష్ చెబుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అనుమానాస్పదంగా మృతి చెందిందని, మెడకు వైరుతో బిగించి చంపినట్లుగా ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జ్యోతి అనారోగ్య కారణాలతో మృతి చెందినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. మృతురాలు జ్యోతికి పరిమళరావు, అక్షయ అనే ఇరువురు సంతానం ఉన్నారు.


ఓర్చు జ్యోతి మృతదేహం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

రా.. కదలిరా సభ ప్రజా తిరుగుబాటుకు సంకేతం

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 30: రా.. కదలిరా సభకు అశేష జనం హాజరు అవటం వైసీపీ ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటుకు నిదర్శనం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశలో ఆయన మాట్లాడుతూ సభ విజయవంతానికి కృషి చేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభను విఫలం చేయాలని అధికార వైసీపీ ఎన్నో కుట్రలకు పాల్పడిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల డ్వాక్రా అధికారులు, మెప్మా రిసోర్స్‌పర్సన్స్ సభలకు వెళ్లితే ఆసరా చెక్కులు, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్లు నిలిపివేస్తామని బెదిరింపులకు పాల్పడారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికి మహిళలు పెద్దఎత్తున సభకు తరలివచ్చారన్నారు. సభకు వచ్చిన మహిళలను వేధించటం కానీ, పథకాలను నిలుపుదల చేయటం కానీ జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పథకాలు నిలిపివేస్తే రాబోయే రోజులో టీడీపీ అధికారంలోకి రాగానే ఆ మహిళలకు న్యాయం చేస్తామన్నారు. జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వడ్రాణం మార్కండేయబాబు ప్రసంగాలు వైసీపీ అరాచకాలను నిలదీసేలా సాగాయన్నారు. పార్లమెంట్ పరిధిలో ఒకే ఒక సీటులో ఆర్యవైశ్యుడైన టీడీపీ నాయకుడు గెలుపొందితే అతనిని కూడా ప్రలోభపెట్టి జగన్‌రెడ్డి తనవైపు తిప్పుకున్నాడని ఆరోపించారు. నమ్మించి అవసరం తీరాక టిక్కెట్ లేదని ఆ ఆర్యవైశ్యుడిని నట్టేట ముంచారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ప్రకృతి వనరులను పెద్దఎత్తున దోచుకున్నాడని ఆరోపించారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కలిసి ముందుకు సాగుతామన్నారు. ముఖ్యంగా పోలీసుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ సభ నిర్వహణ, సభకు వచ్చే వేలాది మంది ప్రజానీకం గురించి జిల్లా ఎస్పీని కలిసి పలుమార్లు వివరాలు అందించారన్నారు. పోలీస్ బందోబస్తును కోరితే ఇచ్చామని చెబుతున్న పోలీసులు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకపోవటం వల్ల పెద్దఎత్తున వాహనాలు రహదారులపై నిలిచిపోయి ప్రజలు సభకు హాజరు కాలేక ఇబ్బందులు పడ్డారన్నారు. అదే జగన్‌రెడ్డి సభలకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇస్తారని, రవాణా శాఖ అధికారులే దగ్గర ఉండి స్కూల్ బస్సులను సభలకు కేటాయిస్తారని ఆరోపించారు. రానున్న రోజులో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందనే దానికి రా..కదలిరా సభ విజయవంతం కావటమే నిదర్శనం అన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసీపీకి చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ళ, జనవరి 30: చంద్రబాబునాయుడుపై అక్రమంగా పెట్టిన కేసులలో ఒకటైన ఇన్నర్ రింగ్‌రోడ్డు విషయంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పుతో ఇకనైనా కనువిప్పు కలగాలని కోరారు. అధికారగణంతో జగన్‌రెడ్డి పెట్టిన తప్పుడు కేసుల్లో ఎప్పటికైనా చంద్రబాబుకే న్యాయం జరుగుతుందన్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు సీఎం జగన్, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెన్నంటే వుంటారన్నారు. టీడీపీకి ఐదు కోట్ల ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అని యరపతినేని తెలిపారు. నేషనల్ క్రైం రికార్డుల నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ మహిళలపై 43శాతం నేరాలు పెరిగాయని, దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో వుండగా, ఏపీలో ప్రతిరోజు 70 కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇన్ని జరుగుతున్నా సంబంధిత మహిళా మంత్రులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగిత రేట్‌లలో ఏపీ మొదటి స్థానంలో వుందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, భూమిపట్టాదారు చట్టం రద్దు చేయబడుతుందని, అన్యాక్రాంతమైన భూములను యజమానులకు అప్పగించేందుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేస్తుందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో 18 ఏళ్ల నిండిన మహిళలకు మహాశక్తి, ఆడబిడ్డనిధి, దీపం పథకాలను అందజేస్తామన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సీలే పార్టీని వీడుతున్నారన్నారు.

జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు వెంటే ప్రజలు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 30: అధికార దుర్వినియోగంతో జగన్‌రెడ్డి అండ్ కో మచ్చలేని చంద్రబాబునాయుడుపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వెంటే ఉన్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసులో ఎదురుదెబ్బ తగిలిందని సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సుప్రీంకోర్టు వాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలని అన్నారు. ఆలస్యమైనా అంతిమంగా నిజం గెలుస్తుందన్నారు. జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం 13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. దేశంలో మహిళలపై నేరాలలో ఏపీ ఆరో స్థానంలో ఉందన్నారు. వైసీపీ నాయకులపై వ్యతిరేకత ఉందన్న కారణంతో ఒక సీటు నుంచి మరోసీటుకు మార్చుకుంటున్నారని, కానీ రాష్ట్రప్రజలు జగన్‌రెడ్డినే మార్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 18 ఏళ్ళు నిండిన మహిళలకు మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధిగా నెలకు రూ.1500, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు.

జడ్పీలో స్థాయి సంఘం సమావేశాలు

గుంటూరు సిటీ, జనవరి 30: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో మంగళవారం 10వ స్థాయి సంఘం సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశాలకు జడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



స్థాయి సంఘం సమావేశాలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



జీబీసీరోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటిస్తున్న నరేంద్రవర్మ

మహాత్మాగాంధీకి ఘన నివాళి

బాపట్ల,జనవరి 30 : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో మహాత్ముని పటానికి పుష్పాంజలి ఘటించి జీబీసీరోడ్డులోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. మహాత్ముని ఆశయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, కూచిపూడి ఝాన్సీరాణి, చెన్నుపాటి హైమావతి, పల్లం జీవన్, కిషోర్, బూర్లె రామసుబ్బారావు, మందపాటి అంద్రేయ, షాకా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● గాంధీజీ సిద్ధాంతాలు ఎల్లకాలాలలో అన్ని దేశాలకు నిత్యనూతనమైనవని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీజీ వర్ధంతిని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని మహాత్ముని విగ్రహం వద్ద నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీదేవి, సిబ్బందితో కలిసి మహాత్ముని విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సర్వేయర్ మాధవి, భవానీ, శ్రీనివాస్, గౌరి పాల్గొన్నారు.

● బాపట్లటౌన్, జనవరి 30 : మహాత్మాగాంధీ ఆశయాలు, ఆలోచనలు ప్రజలందరికి స్ఫూర్తి అని జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇమ్మడిశెట్టి మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని చీలురోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ శ్రీభావన్నారాయణస్వామి ఆలయం ఎదురు ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఎన్నో సంవత్సరాలుగా అక్కడ ఉందని స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి రోడ్డు విస్తరణలో భాగంగా ఆ విగ్రహాన్ని తొలిగించటం ప్రజల మనోభావాలను అవమాన పరిచినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో సుజిత్, ఊసా ప్రసాద్, ఇమ్మడిశెట్టి సురేష్, నామన శ్యామ్, షేక్.కరీముల్లా, షేక్.సలాం పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 30 : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, బట్టు మల్లికార్జునరావు, ఆదిన బసవపున్నయ్య, యడ్ల జయశీలరావు, ఇబ్రహీంబేగ్, శ్రీనివాసరావు, కంభం సుధీర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రథం సెంటర్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి వాసవీక్లబ్ అధ్యక్షుడు బూర్లె సుబ్బారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అద్దేపల్లిలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో వాసవీక్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘీయులు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం చేసి పెండింగ్ కేసులు తగ్గించాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్

బాపట్ల, జనవరి 30 : దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను తగ్గించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సెబ్ అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం కట్టడికి అనుమానిత ప్రాంతాలలో నిరంతర దాడులు నిర్వహించాలన్నారు. సరైన బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేయాలన్నారు. విధులుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన, అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలంటే ముందుగా అక్రమ మద్యం, నాటు సారాను అరికట్టాల్సి ఉందన్నారు. రైల్వే, రోడ్డు మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి వచ్చే అవకాశం ఉన్నందున వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసి వాహనాలు సీజ్ చేయాలన్నారు. ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. పాతనేరస్థుల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, సెబ్ ఏఈఎస్ జి.నరసింహారావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి తోటి కానిస్టేబుళ్ళు అండగా నిలిచారు. 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ళు అంతా కలిసి రూ.2,44,000 సేకరించి మృతుని భార్య శ్రావణికి మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదగా అందజేశారు. నిజాంపట్నం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ మోపిదేవి చలపతిరావు లివర్ సమస్యతో మృతి చెందాడు. అతని కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తోటి బ్యాచ్ సిబ్బంది నగదు సేకరించి అందజేయటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు సాయికుమార్, శివ శంకర్, నరేష్, జానకి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సెర్ప్ సిబ్బంది దీక్షలు

బాపట్ల, జనవరి 30 : సమస్యల పరిష్కారం కోరుతూ వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఎం.ఎస్‌సిసిలు, కమ్యూనిటి సర్వేయర్లు, సీసీలు, ఏపిఎమ్‌లు, డిపిఎమ్‌లు చేపట్టిన రిలేనిరాహారదీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఉప్పరపాలెం రోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కె.గాంధీ. కె.శివకోటేశ్వరరావు, జి.శ్రీమన్నారాయణ, టి.శ్రీనివాసరావు, టి.శ్రీధర్‌లు రిలే నిరాహారదీక్షలో కూర్చొన్నారు. జేఏసీ నాయకులు టి.రాజారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల అమలులో ప్రధానపాత్ర పోషిస్తున్న తమ సమస్యలపై స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టి.రాజారావు, చాట్ల సాల్మన్, కాకి రవికుమార్, కె.వెంకటస్వామి, వందనం, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం



జమ్ములపాలెంలో భువనేశ్వరికి ఘనస్వాగతం పలికి సత్కరించిన గ్రామస్థులు

బాపట్ల, జనవరి 30 : తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను తట్టుకోలేక మరణించిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు మంగళవారం బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి బాపట్లలో ఘనస్వాగతం పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లి వచ్చిన ఆమెను నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడ నుంచి పర్చూరు నియోజకవర్గానికి బాపట్ల మీదగా వెళుతున్న ఆమెకు చెరువుజమ్ములపాలెం గ్రామంలో ఘనస్వాగతం పలికారు. గ్రామస్తులు పెద్దఎత్తున రోడ్డుమీద కొచ్చి మహిళలు ఆమెను చూసి నినాదాలు చేశారు. భువనేశ్వరిని సన్మానించారు. పార్టీశ్రేణులు, చిన్నారులతో ఆమె మాట్లాడి పర్చూరు నియోజకవర్గానికి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నుపాటి కిషోర్, కె.గాంధీ, కె.శ్రీనివాసరెడ్డి, కె.యజ్ఞేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 30 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా పర్యటనకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి మహిళలు ఘన స్వాగతం పలికారు. కొల్లూరు మండలం నుంచి భట్టిప్రోలు మండలం వెల్లటూరు మీదుగా చెరుకుపల్లి మండలం వెళ్తున్న భువనేశ్వరికి మంగళవారం వెల్లటూరులో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కాన్వాయ్‌ను నిలుపుదల చేసి స్వాగతం పలికారు. మహిళల అభ్యర్ధన మేరకు వాహనం నుంచి బయటకు వచ్చి ప్రజలకు భువనేశ్వరి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఆమె వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ నాయకులు ఉన్నారు. టీడీపీ మండల నాయకులు ద్విచక్రవాహనాలతో భువనేశ్వరి కాన్వాయ్ వెంట తరలివెళ్ళారు.

అభయాంజనేస్వామికి ప్రత్యేక పూజలు

కొల్లూరు, జనవరి 30 : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు ఘన స్వాగతం పలికారు. మంగళవారం నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి వెళుతున్న భువనేశ్వరికి కొల్లూరు మండలం చిలుమూరు వద్ద మాజీ మంత్రి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంకటేశ్వర స్వామి మెమొంటో, పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. అనంతరం చిలుమూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భువనేశ్వరికి వేదాశీస్సులు అందజేశారు. తొలుత టీడీపీ మహిళా నేతలు హారతులతో ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమకేసులో జైలులో ఉన్నప్పుడు దిగులుతో చనిపోయిన కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేసి భరోసా ఇవ్వడానికి భువనేశ్వరి పర్యటిస్తున్నారని, జగన్ ఓటమి మొదలైందని, అవినీతి కేసుల్లో కూరుకుపోయి జైలులో ఉండివచ్చిన జగన్ ప్రతిపక్ష నేత చంద్రబాబుపై సాక్ష్యాలు లేని అక్రమ కేసులు పెట్టి బురద చల్లాలని చూస్తున్నారన్నారు. జగన్ పుట్టు పూర్వోత్తరాలు, ఆయన బతుకు, అతని చెల్లెలు రోడ్డున పడేస్తున్న పరిస్థితిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, జివిఎల్‌జి భగవాన్, తాతాజీ, నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చిలుమూరులో కార్యకర్తలకు విక్టరీ సింబల్‌తో అభివాదం చేస్తున్న భువనేశ్వరి

నారా భువనేశ్వరి చిలుమూరు పర్యటనలో జేబు దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. చిలుమూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భువనేశ్వరిని చూసేందుకు పోటీ పడగా ఇదే సమయమని భావించిన జేబు దొంగలు పలువురు జేబులో నుంచి నగదు, సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. గమనించిన కార్యకర్తలు ఇరువురు దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించారు.

నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన మహిళలు

రేపల్లె, చెరుకుపల్లి, జనవరి 30 : నారా భువనేశ్వరి చెరుకుపల్లి వస్తున్నారని తెలియటంతో నియోజకవర్గం నుంచి వేలాదిగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు,మహిళలు భారీగా తరలివచ్చారు. తోట వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆప్యాయంగా వారి దగ్గరకు వెళ్ళి పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని జైచంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నగరం మండల పార్టీ అధ్యక్షులు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, చెరుకుపల్లి మాజీ జడ్పీటీసీ పిట్టు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించాలి : కలెక్టర్

బాపట్ల, జనవరి 30 : ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈనెల 31వ తేది నుంచి ప్రారంభించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఈ విషయమై సంబంధితశాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడా పోటీలు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. క్రికెట్,వాలీబాల్, కబడ్డీ, షటిల్, ఖోఖో క్రీడల నిర్వాహణకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్, బాపట్ల జూనియర్ కళాశాల క్రీడా మైదానాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయి క్రీడలకు 60టీమ్‌లు బాపట్లకు వస్తున్నాయన్నారు. 684మంది క్రీడాకారులు హాజరు కానున్నారని వివరించారు. క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డిఆర్‌వో పి.వెంకటరమణ, ఆర్డీవో గంధం రవీందర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ కె.పాల్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ కె.రామచంద్రారెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఆర్.వి. శ్రీనివాసరావు, ఏవో గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి : పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

బాపట్ల, జనవరి 30 : బాలల హక్కుల పరిరక్షణ, వారి శ్రేయస్సును కాంక్షించేలా అన్ని ప్రభుత్వ శాఖలు ప్రణాళికలతో అడుగులు వేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో డీఆర్‌వో పి.వెంకటరమణ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, వారి సంక్షేమానికి చేపడుతున్న చర్యలు పై ఆయా విభాలలో అమలు చేస్తున్న వాటి గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పర్యటనలు జరుపుతుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై డేగకళ్ళతో గమనించి రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బాపట్లఏరియా వైద్యశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.ఉమాదేవి, అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డిప్యూటీ డీఈవో శ్రీనివాస్, డిఐవో వెంకటేశ్వర్లు, సీడీపీవ బి.శైలజ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, ఇన్‌చార్జి డిసిపివో పి.పురుషోత్తం, కౌన్సిలర్ జి.రోజిలిన్, సోషల్ వర్కర్ పి.సులోచన, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకనంలో నిబంధనలు పాటించాలి

బాపట్లటౌన్, జనవరి 30 : ఫిబ్రవరి నెలలో జరగనున్న ఇంటర్ ప్రయోగాత్మక పరీక్షల మూల్యాంకనంలో సరికొత్త నిబంధనలను ఎగ్జామినర్‌లు తప్పనిసరిగా పాటించాలని డీవీఈవో పి.యరయ్య అన్నారు. జిల్లాలో వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇంటర్ ప్రయోగాత్మక పరీక్షలకు నియమించిన ఎగ్జామినర్ అదే రోజు వెంటనే పేపర్లను మూల్యాంకనం చేసి స్వయంగా అదే రోజు కంప్యూటర్ సిస్టమ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అన్ని కళాశాలల్లో సీసీ టీవీ పర్యవేక్షణలో ప్రయోగాత్మక పరీక్షలను నిర్వహించటం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే హ్యూమాన్ వెల్యూవుస్ అండ్ ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ పరీక్షలకు విద్యార్థులంతా హాజరయ్యే విధంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వేదవతి, పి.సుధాకర్, సీహెచ్ సతీష్‌బాబు, శ్యామ్‌బాబు, వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నందిపాటి సుబ్బారావుకు నేతల ఘననివాళి

కర్లపాలెం,జనవరి 30 : కర్లపాలెం మండల యాజలి గ్రామానికి చెందిన దివంగత నందిపాటి సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం సుబ్బారావు చిత్రపటానికి బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, బాపట్ల వైసీపీ సీనియర్ నాయకులు మోదుగుల బసవపున్నారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కళ్ళం హరినాధ్‌రెడ్డి, కర్లపాలెం మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



దుప్పట్లుపంపిణి చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

పెన్షన్‌దారులకు దుప్పట్లు పంపిణీ

పిట్టలవానిపాలెం, జనవరి 30 : మండలంలోని ఖాజీపాలెం సచివాలయంలో కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులకు మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్న రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని సుమారు 800 పైగా దుప్పట్లు పంపిణీ చేశారు. కోన రఘుపతి మాట్లాడుతూ తమ ట్రస్ట్ పరంగా ప్రజలకు ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఖాజీపాలెం ఎంపీటీసీ కాగిత కాంతకుమారి, వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, ఖాజీపాలెం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి దేవేంద్రరాజు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్య, అలకాపురం, కోమలి, చందోలు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు మంతెన గంగరాజు, శ్యామలా నాగిరెడ్డి, ఎండి మునీర్, దబ్బకూటి మాధవరావు, ఎంపీటీసీ చెన్నుబోయన గంగయ్య, కట్టే కుమారి, మంతెన సుబ్బరాజు, మాజీ సర్పంచ్‌లు బడుగు ప్రకాష్, మంతెన రామచంద్రరాజు, అల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి, చందోలు శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌లు వాలి వెంకటశివారెడ్డి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఖాజీపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, అల్లూరి సొసైటీ అధ్యక్షులు మండే విజయ్‌కుమార్, గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని భవనవారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని చౌడిపాలెం గ్రామంలో జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రార్ధన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొంతిరెడ్డి సింధు కోటిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, న్యాయవాది కంచర్ల అవినాష్ పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, జనవరి 30 : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో పెన్షన్‌దారులకు మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి కోన రమాదేవి దుప్పట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, వైసీపీ నాయకులు వడ్డిముక్కుల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం,జనవరి 30 : కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం, బుద్దాం, యాజలి గ్రామాలలో కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షన్ దారులకు ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ దుప్పట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు, వైసీపీనాయకులు, కర్లపాలెం -2 ఎంపీటీసీ అసిఫ్, చీరాల సత్యనారాయణరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి, జెనర్లి డీలర్ రవి పాల్గొన్నారు.

షర్మిల పర్యటన జయప్రదం చేయాలి

బాపట్ల, జనవరి 30 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాధ్యక్షులు షర్మిల రెడ్డి ఫిబ్రవరి 8వ తేదీన బాపట్లలో రోడ్డుషో నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పఠాన్ రాజేష్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, బాపట్ల పార్లమెంట్ ఇన్‌చార్జి జెడి.శీలం ఆహ్వానం మేరకు పర్యటనకు షర్మిలారెడ్డి వస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు పి.శంకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, నాయకులు బక్కా రోశయ్య, పోలిరెడ్డి, అమానుల్లాబేగ్, నాయిబ్‌రసూల్, బుజ్జి, రవి రాజు,శీలం సాగర్, దోనేపూడి రవి, సురేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో అడవి పంచాయతీ కార్యదర్శి రాజా దుర్గా ప్రసాద్ మృతి

బాపట్లరూరల్, జనవరి 30 : బాపట్ల మండలం అడవిపంచాయతీ కార్యదర్శి గుండ వరపు రాజా దుర్గాప్రసాద్ గుండెపోటుతో మంగళవారం ఉదయం పొన్నూరులోని తన నివాసంలో మృతి చెందారు. మండలంలోని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంపీడీవో పులి శరత్‌బాబు, పలువురు ఆయన పార్థివ దేహానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, జనవరి 30 : వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని కనగాల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి 20 కుటుంబాలు కరిముల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీలో ఉన్న ఎమ్మెల్యేలే టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన రఫీ మస్తాన్, అబ్దుల్ వారి అనుచరులు, కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, ఎంఆర్‌కే మూర్తి, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తాతా ఏడుకొండలు, ఉప్పాల సాంబశివరావు, దివి రాంబాబు, కాటూరి నాగేశ్వరరావు, ఆలా రాధాకృష్ణ, పీర్ అహ్మద్, అలీ, సయ్యద్ రఫీ, ఈన్యూస్, ఆర్యాదుల ప్రసాద్, ఉయ్యూరు శజవకృష్ణ ఉన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే అనగాని ఆర్థికసాయం

బాధితులకు ఆర్థిక సహాయం అందించడంలో టీడీపీ ముందుంటుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ఆళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన కూరేటి అశోక్ రామదాసుకు చెందిన ఎకరంన్నర వరికుప్ప దగ్ధమైంది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అశోక్ రామదాసు కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, టీడీపీ నాయకులు ఎనుగుల కోటేశ్వరరావు, కూరేటి విజయభాస్కర్, ఉప్పాల సాంబశివరావు, పున్నారావు, వీరంకి శివ, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినిపై వాచ్‌మన్ అత్యాచారం

బాపట్ల, జనవరి 30 : పాఠశాలలో రక్షణగా ఉండాల్సిన వాచ్‌మన్ ఏడవ తరగతి విద్యార్థినిపై అత్యాచారం చేయటం బాపట్లలో కలకలం రేపింది. బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ వసతి గృహంలో ఉండే విద్యార్థిని స్థానిక పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది. మంగళవారం స్కూల్‌కు వెళ్లిన విద్యార్థిని మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు వాచ్‌మన్ ఫోన్ అడిగింది. వాచ్‌మన్ ఫోను ఇస్తానని చెప్పి నూతనంగా నిర్మించిన భవనం పై అంతస్తుకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో ఆ బాలిక విలపిస్తుండగా తోటి విద్యార్థులు విషయాన్ని అడిగి తెలుసుకుని క్లాస్ టీచర్‌కు తెలిపారు. ఉపాధ్యాయని విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లగా ఆమె మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయిని కలిసి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యు.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత బాలికను, ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను విచారించి బాలికను వైద్య పరీక్షలకు పంపిస్తున్నట్టు తెలిపారు.

కేటీ కాలనీ సందర్శించిన ఆర్డీవో

కొల్లూరు, జనవరి 30 : తమ ఇళ్లకు పట్టాలు పంపిణీ చేయాలని కేటీ కాలనీ వాసులు ఆర్డీవో హేరా షారోన్‌కు విన్నవించుకున్నారు. మంగళవారం కొల్లూరు శివారులోని కెటి కాలనీని ఆర్డీవో సందర్శించారు. ఆర్డీవో తొలుత ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని, పట్టాల పంపిణీ అనంతరం స్మశాన స్థలం తదితర వాటిని పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం అనంతవరంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ శివత్రివేణి, విఆర్వో రవికుమార్, వైసీపీ నాయకులు నర్రా వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలి

వేమూరు, జనవరి 30 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశువుల బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు కోరారు. మంగళవారం ఆయన వేమూరులోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్లతో మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉండి పాడి పశువులను పోషించే రైతులు ఒక్కొక్క పశువుకు కేవలం రూ.384లు బీమా చెల్లిస్తే మూడు సంవత్సరాల కాల పరిమితితో సంబంధించిన పశువు మృతి చెందినప్పుడు బీమా సొమ్ము కింద ఆ రైతుకు రూ.30 వేలు అందించబడుతుందన్నారు. వేమూరు ఏడి కార్యాలయం భవనంపై అంతస్తులు పశువులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహించేందుకు అధునాతనమైన పరికరాలతో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

సూరేపల్లిలో రెండు పూరిళ్ళు దగ్ధం

భట్టిప్రోలు, జనవరి 30 : మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన కొమరగిరి కోటేశ్వరరావు, కొమరగిరి శివయ్యలకు చెందిన రెండు పూరిళ్ళు మంగళవారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో కాలిబూడిదయ్యాయి. పూరిళ్ళు దగ్ధం కావడంతో కట్టుబట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. కొమరగిరి కోటేశ్వరరావుకు రూ.2 లక్షలు, కొమరగిరి శివయ్యకు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలియజేశారు. వీఆర్‌ఓ లంకె సురేష్, ప్రజాప్రతినిధులు బాధితులను పరామర్శించి నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

కొల్లూరు ఎస్ఐ రాజ్యలక్ష్మి వీఆర్‌కు బదిలీ

కొల్లూరు, జనవరి 30 : కొల్లూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి విఆర్‌కు బదిలీ అయ్యారు. శాఖపరంగా విధి నిర్వహణలో ఆమెపై వచ్చిన ఆరోపణలతో పాటు ఓ ప్రభుత్వ పెద్ద ఒత్తిడితో ఆమెను విఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ఆమె స్థానంలో ఇప్పటి వరకు ఎవరూ నియామకం కాలేదు. ఆమె కొల్లూరు స్టేషన్‌లో ఏడు నెలలు మాత్రమే విధులు నిర్వహించారు.

మహిళల అభ్యున్నతే వైసీపీ ధ్యేయం : మోపిదేవి



చెక్కును అందిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు తదితరులు

రేపల్లె, జనవరి 30 : మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత సందర్భంగా పట్టణ పరిధిలోని 304 స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.5 కోట్ల 51 లక్షల 68వేల 923ల చెక్కును ఆయా సంఘాలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళా అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళ్ళుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగా, పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణ, వైస్ చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, గుజ్జర్లమూడి ప్రశాంత్, కౌన్సిలర్ షేక్ జమీర్, బేతపూడి కోటేశ్వరరావు, చదలవాడ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్హత సాధించిన 236 మంది

రేపల్లె, జనవరి 30 : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడు ముందంజలో ఉంటుందని రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధిశాఖ, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 20కి పైగా కంపెనీలు ప్రతినిధులు పాల్గొనగా 758 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరు కాగా కంపెనీ ప్రతినిధులు 236 మందిని సెలెక్ట్ చేశారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ భరోసా కల్పించే విధంగా జగన్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి తమ్మాజీరావు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

నరేష్‌పై అట్రాసిటి కేసును ఎత్తివేయాలి : కాపు జేఏసీ

రేపల్లె, జనవరి 30 : రాష్ట్రంలో జర్నలిస్టులపై కేసులు పెరిగిపోయాయని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్ధన్‌రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా పని చేస్తున్న ఉప్పూడికి చెందిన అల్లంశెట్టి నరేష్‌పై రేపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయటాన్ని చందు జనార్ధన్‌రావు తీవ్రంగా ఖండించారు. రేపల్లెలో లేకపోయినప్పటికి జర్నలిస్టు నరేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయటం సరైనది కాదన్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు దృష్టి సారించి కేసును తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఫ్యాక్టరీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గ్రానైట్ ఫ్యాక్టరీలో విజిలెన్స్ తనిఖీలు

బల్లికురవ, జనవరి 30: మండలంలోని వేమవరం వద్ద ఉన్న హరగాయత్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం మచిలీపట్నం నుంచి వచ్చిన మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తనఖీలు నిర్వహించారు. టీడీపీకి చెందిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుని గ్రానైట్ ఫ్యాక్టరీ అయినందున తనిఖీలు చేసినట్లు తెలుస్తుంది. గ్రానైట్ ఫ్యాక్టరీలో స్టాకు నిల్వలు, కొలతలు తీసినట్లు తెలుస్తుంది. తనిఖీలు ఎందుకు చేస్తున్నరన్న విషయం వెల్లడించేందుకు అధికారులు నిరాకరించటం పలు అనుమానాలకు తావిస్తుంది. మరోమారు తనిఖీలకు వస్తామని చెప్పి వెనుతిరిగారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులలో ఆందోళన నెలకొంది. టీడీపీ వర్గీయులను టార్గెట్‌గా విజిలెన్స్ అధికారుల చేత వైసీపీ నేతలు దాడులు చేయిస్తున్నారని పలువురు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆరోపిస్తున్నారు. అన్ని ఫ్యాక్టరీలను తనిఖీ చేయకుండా టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలనే టార్గెట్‌గా దాడులు చేయటం వెనుక వేధింపులకు గురిచేయటమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు

- ప్రారంభమైన రవాణా
- సీనరేజ్ తగ్గించినా భవన నిర్మాణదారులకు చేరేసరికి అదే ధర
- వైసీపీ నేతల తీరుపై పెదవి విరుపు



అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లు



గుండ్లకమ్మ నదిలో ఇసుకను ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తున్న కూలీలు

అద్దంకి, జనవరి 30: కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వైసీపీ నేతల తీరు ఉందని పలువురు భవనాల నిర్మాణదారులు పెదవి విరుస్తున్నారు. అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి గత నాలుగు నెలలుగా ఇసుక రవాణా నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కాంట్రాక్టర్ ఇసుక సీనరేజ్ వసూలు ప్రారంభించినప్పటి నుంచి గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణా నిలిపివేశారు. గతంలో సైతం అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణాకు అధికారిక రీచ్ లేకపోయినప్పటికీ ఇసుక తవ్వకాలు మాత్రం యథావిధిగా సాగాయి. అనంతరం కూడా అదే పంథాలో కొనసాగించేందుకు కొత్త కాంట్రాక్ట్ పొందిన కార్పొరేట్ సంస్థ ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ ప్రజలలో ఇసుక సీనరేజ్ వసూలు పట్ల ఉన్న వ్యతిరేఖత నుపొగొట్టాలని స్థానిక వైసీపీ నేతలు సీనరేజ్ వసూలుకు ససేమిరా అన్నారు. దీంతో ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయింది. కొత్తగా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి సైతం ఉచితంగా సీనరేజ్ లేకుండా ఇసుక రవాణాకు అనుమతులు ఇప్పిస్తానని స్థానిక వైసీపీ నేతలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, టెండర్ సంస్థ మాత్రం ససేమిరా అనటంతో పాటు తగ్గించేందుకు కూడా నిరాకరించినట్లు సమాచారం. ఈక్రమంలో ఇసుక కష్టాలు మరింత పెరిగాయి.

నిబంధనల మేరకు ట్రాక్టర్ ఇసుక లోడింగ్‌తో సహా రూ.1950 సీనరేజ్‌గా చెల్లించాల్సి ఉంది. అయితే, గుండ్లకమ్మ నదిలో ఇసుకను కూలీల ద్వారా జల్లెడ పట్టించి రవాణా చేస్తుంటారు. ఈక్రమంలో సీనరేజ్ సంస్థకు లోడింగ్‌తో పని ఉండదు. దానిప్రకారం రూ.1450 మాత్రమే తీసుకోవాలి. ఇసుక సీనరేజ్ వసూలు ప్రారంభించిన ప్రారంభంలో రెండువేల రూపాయలు ఉండగా, అనంతరం రూ.1800 సీనరేజ్ వసూలు చేశారు. మంగళవారం నుంచి ఇసుక రవాణా ప్రారంభం కాగా, రూ.1400 వసూలు చేసేలా చర్చలు సఫలమైనట్టు తెలుస్తుంది. రూ.1800 సీనరేజ్ వసూలు చేసినప్పుడు, ఇప్పుడు రూ.1400కు తగ్గించినా అద్దంకి పట్టణంలోకి ట్రాక్టర్ ఇసుక ధర మాత్రం రూ.3300 నుంచి రూ.3500గానే ఉండటం విశేషం. సీనరేజ్ రూ.400 తగ్గించామని వైసీపీ నేతలు చెప్పుకుంటుండగా, కొనుగోలుదారునికి గతంతో పోల్చితే మూడు వేల రూపాయలకే చేరాల్సి ఉంది.

అయినప్పటికీ మంగళవారం నుంచి ఇసుక రవాణాదారులు కూడా రూ.3500 చొప్పున వసూలు చేయటం మరింత విమర్శలకు తావిస్తుంది. నాలుగు నెలల పాటు ఇసుక రవాణా జరగకుండా నిలిపివేసి చివరకు ఒరిగింది శూన్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



శనగ పంటను పరిశీలిస్తున్న డాట్ శాస్త్రవేత్త డాక్టర్ ఓబయ్య, తదితరులు

వేంరవెంట్ల, జనవరి 30: మండలంలోని దైవాల రావూరులో ఎండిపోతున్న శనగ పంటను వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, డాట్ శాస్త్రవేత ఎం. ఓబయ్య పరిశీలించారు. మంగళవారం ఎండిపోతున్న శనగను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కోలెట్రోట్రైకం అనే శిలింధ్రం వల్ల పంట ఎండిపోతున్నట్లు ఓబయ్య తెలిపారు. భూమిలో కర్బన శాతం లోపించినప్పుడు ఈ తెగులు వస్తుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల తెగుళ్లను నివారించవచ్చునని చెప్పారు. విత్తనశుద్ధిని తప్పనిసరిగా చేయాలన్నారు. పంట మార్పిడి చేసుకోవాలన్నారు. తొలకరిలో పచ్చిరొట్ట ఎరువులయిన జీలుగా, జనుము, పిల్లిపెసర వంటి పంటలను సాగుచేసి భూమిలో దున్నివేయడం వలన కర్బన శాతం పెరుగుతుందన్నారు. పంట వేసిన 40, 45 రోజులకు లీటర్ నీటికి బావిష్టన్2 గ్రాములు కలిసి పిచికారి చేయడం వలన తెగుళ్లను నివారించువచ్చునని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత డాక్టర్ జె.రాధకృష్ణ, వీఏఏ ప్రత్యూష, రై తులు పాల్గొన్నారు.

డీపీటీవో వైఖరిపై నిరసన

అద్దంకిటౌన్, జనవరి 30: అద్దంకి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల పట్ల విశాఖపట్నం డీపీటీవో తన వైఖరి మార్చుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని డిపో సెక్రటరీ అనపర్తి వందనంబాబు హెచ్చరించారు. డిపో అభివృద్ధిలో భాగమైన కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం డిపోకే నష్టమని అన్నారు. కార్యక్రమంలో డీఎంఎస్ మన్యం, కె.భానుప్రకాష్, ఎం.అంజి, ఎన్‌కే రావు, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా కార్యాలయం తనిఖీ

అద్దంకిటౌన్, జనవరి 30: అద్దంకి ఉప ఖజానా కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా ఉపఖజానాధికారిణి శివకామేశ్వరి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా శివకామేశ్వరిని అద్దంకి తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, కార్యదర్శి తాళ్ళూరి రమేష్‌బాబు, జి. ఏడుకొండలు, కె. రవికుమార్, కార్యవర్గ సభ్యులు కలిసి అభినందించారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

చీరాలటౌన్, జనవరి 30: మండల పరిధిలోని కొత్తపాలెం పంచాయతీ శ్రీనివాస కాలనీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకుడు వసంతరావు డిమాండ్ చేశారు. గ్రామంలో ఓ వ్యక్తి సెల్ టవర్ నిర్మాణానికి పూనుకోవడంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఇప్పటికే పలు అనారోగాల బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ఈక్రమంలో సెల్‌టవర్ రేడియేషన్ ప్రభావంతో మరింత ఇబ్బందులు చోటుచేసుకుంటాయన్నారు. ఈ కారణంగా నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు వబ్బాని, దుర్గా ప్రసాద్, ఈగా వెంకటేశ్వరమ్మ, లక్ష్మీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించకుంటే చర్యలు

చీరాలటౌన్, జనవరి 30: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించకుంటే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆటోడ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నట్లు వివరించారు. దీనికితోడు ఆటో డ్రైవర్‌లు నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా ఇష్టారీతిగా ఆటోలు పార్కింగ్‌లు చేస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ జరగాలంటే ఆటోడ్రైవర్‌లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై గోపి, ఏఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ స్టీఫెన్, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులు కేటాయించరా!

మార్టూరు, జనవరి 30: మండల పరిషత్ నిధులు తమ గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని పలువురు ఎంపీటీసీలు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతి బాబు అధ్యక్షత వహించారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి మండల పరిషత్ నిధులు తమకు కేటాయించడం లేదని, దాంతో గెలిపించిన ప్రజానీకానికి ఏం సమాధానం చెప్పాలని పలువురు ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈవిషయమై మరోసారి ప్రత్యేకంగా ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేస్తామని ఎంపీడీవో నితిన్ చెప్పారు. నాగరాజుపల్లి బీసీ కాలనీలో రెండు వీధుల్లో మురుగు కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ దాసరి నరేంద్రబాబు కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, ఎంఈవో వస్రాం నాయక్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, వ్యవసాయ ఏవో వీరగంధం ఆశోక్‌కుమార్, ఉద్యాన అధికారి హనుమంత నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతమాగులూరు, జనవరి 30: మండలంలోని ఏల్చూరు పంచాయతీ రామిరెడ్డిపాలెం గ్రామంలో అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లను సంతమాగులూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా రామిరెడ్డిపాలెంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న అక్రమ మద్యంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మంగళవారం తనికీలు నిర్వహించి అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 248 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

అద్దంకి, జనవరి 30: అద్దంకిలో తాళం వేసిఉన్న ఇంట్లో చోరి జరిగి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ కు గురయింది. పోలీసుల కథనం మేరకు .. అద్దంకి పట్టణంలోని విశ్వభారతి కళాశాల రోడ్డులో సెల్ టవర్ సమీపంలో దేసు శివ నాగరమేష్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం ఒడిస్సాలోని పూరి జగన్నాథస్వామి దైవదర్శనంకు వెళ్ళారు. మంగళవారం ఉదయం తీర్థయాత్రలు ముగించుకొని ఇంటికి రాగా, మెయిన్ ద్వారం తాళం పగులగొట్టి ఉంది. బీరువా తాళాలు అక్కడే ఉండటంతో దొంగలకు చోరీ సులువైంది. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదుతో పాటు 14 సవర్ల బంగారం ఆభర ణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. సంఘటనాస్థలాన్ని సీఐ కృష్ణయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ బృందం పరిశీలించారు.

373 మందికి వైద్య పరీక్షలు

పంగలూరు, జనవరి 30: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శివచెన్నయ్య, డాక్టర్ రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో మంగళవారం ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 373 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కృష్ణకుమార్, సూపర్‌వైజర్ మదర్‌షా, హరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాతి మండపం పునర్నిర్మాణ పనుల పరిశీలన

అద్దంకి, జనవరి 30: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునర్నిర్మాణ పనులను రాష్ట్ర దేవాదాయ స్థపతి పరమేశ్వరప్ప మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు సంఘీభావం తెలిపిన వైసీపీ నేత

అద్దంకి, జనవరి 30: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్, అద్దంకి పంచాయతీ మాజీ వార్డు మెంబర్, వైసీపీ నేత ఆకుల కోటేశ్వరరావు మంగళవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. జొన్నతాళిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి సంఘీభావం తెలిపారు.

రామనామ సంకీర్తనతో మనస్సు ప్రశాంతం

పర్చూరు, జనవరి 30: రామనామ సంకీర్తనతో మనస్సు ప్రశాంతత పొందుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. పర్చూరులోని వైజంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 92 అడుగుల అభయాంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. గర్వం తొలగించే హనుమంతుడు అనే అంశంపై వివరణాత్మక సందేశం ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్టూరు ఘటనలో పరస్పర ఫిర్యాదులు

మార్టూరు, జనవరి 30: కృష్ణా జిల్లా విజిలెన్స్ ఏడీ ప్రతాప్ రెడ్డి ప్రయివేటు వ్యక్తులతో వచ్చి బెదిరిస్తూ గ్రానైట్ పరిశ్రమ యజమానులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మంగళవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, అనంత గ్రానైట్ పరిశ్రమ యజమాని విడివిడిగా ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం నాగరాజుపల్లి రోడ్డులో ఉన్న అనంత గ్రానైట్‌లో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ తనిఖీలు చేశారు. గ్రానైట్ పరిశ్రమలలో ఉన్న ఇబ్బందులను గ్రానైట్ పరిశ్రమ యజమాని కామినేని జనార్దన్‌తో పాటు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ వివరించారు. ఆసమయంలో కృష్ణా జిల్లా ఏడీ ప్రతాప్ రెడ్డి, వైజాగ్ ప్రాంతం వైసీపీకి చెందిన కె.శ్రీనివాసరావు ఉరఫ్ వాసుతో అక్కడికి ప్రయివేటు వాహనంలో వచ్చారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు లక్షల రూపాయలు ఇవ్వకపోతే కేసులు పెడతామని, తాను అధికార పార్టీకి చెందిన వాడినని కె.శ్రీనివాసరావు పరిశ్రమల యజమానులను డిమాండ్ చేశారు. ఈవిషయంపై యజమానులు సమాచారం అందించడంతో అక్కడికివచ్చిన టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఏడీ ప్రతాప్‌రెడ్డితో తనిఖీలకు అనుమతులు ఎవరిచ్చారనే విషయంపై ప్రశ్నించారు. ఈక్రమంలో కె.శ్రీనివాసరావు ఎమ్మెల్యేతో దురుసుగా మాట్లాడారు. మొదట తాను వైజాగ్ ఏడీనని, తరువాత ఏడీ కారు డ్రైవర్‌నని చెప్పారు. దీనిపై ఏడీని అడుగగా శ్రీనివాసరావు తన స్నేహితుడని చెప్పారు. ఈవిషయమై మార్టూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి కె.శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. అతను వచ్చిన కారును తనిఖీ చేయగా అందులో కర్రలు, కారం పొట్లాలు ఉన్నాయన్నారు. కారు నంబరు ప్లేటు కూడా లేకుండా కేవలం ఒక నంబరు స్టిక్కరు ఏర్పాటు చేశారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను డబ్బుకోసం భయభ్రాంతులకు గురిచేసిన ఏడీ ప్రతాప్ రెడ్డి, వైసీపీకి చెందిన కె.శ్రీనివాసరావు నుంచి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని, తమకు న్యాయం చేయాలని వారు తమ ఫిర్యాదు లో పేర్కొన్నారు. గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్‌తో పాటు పలువురు గ్రానైట్ పరిశ్రమ యజమానులు ఆయన ఇచ్చిన ఫిర్యాదులో మద్దతుగా తమ సంతకాలు పెట్టారు.

విధులకు ఆటంకం కలిగించారని విజిలెన్స్ ఏడీ ఫిర్యాదు

అనంత గ్రానైట్ పరిశ్రమలో తనిఖీలకు వచ్చిన తమ విధులకు ఆటంకం కలిగించారని నెల్లూరు విజిలెన్సు ఏడీ బాలాజీ నాయక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పరిశ్రమ యజమానితో పాటు మరో ఏడుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు

అద్దంకి, జనవరి 30: అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓప్రకటన విడుదలచేశారు. చంద్రబాబునాయుడు బెయిల్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్ళిందన్నారు. సుప్రీంకోర్టు ప్రభుత్వానికి చివాట్లు పెట్టిందన్నారు. ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి, జగన్ కు బుద్ధిరావాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వెంటే ఉన్నారని చెప్పారు. వందల కోట్లు ఖర్చు పెట్టి సుప్రీంకోర్టుకు వెళ్ళినా భంగపడ్డారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను రా.. కదలిరా ద్వారా చంద్రబాబునాయుడు ఎత్తి చూపించారన్నారు. టీడీపీకి 5 కోట్ల ప్రజలే స్టార్ క్యాంపైనర్లు అని రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయన్నారు. జగన్‌రెడ్డి తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారన్నారు. ఒకప్పుడు వైనాట్ 175 అన్న వ్యక్తి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఓడిపోయినా తప్పులేదని అని వాస్తవాన్ని గ్రహించారన్నారు. జగన్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. జగన్‌రెడ్డి చెత్త పరిపాలనతో రాష్ట్రం రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు.

అభివృద్ధిలో ముందుందాం



మాట్లాడుతున్న కరణం వెంకటేష్, పక్కన ఎమ్మెల్యే బలరాం తదితరులు

వేటపాలెం(చీరాల), జనవరి 29: అభివృద్ధిలో ముందుందాం.. సత్ఫలితాలు సాధిద్దామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో నూతనంగా రూ.5.60 కోట్లతో నిర్మించిన సచివాలయం 1,2, రైతు భరోసా కేంద్రం, ఆర్‌డబ్ల్యూఎస్, సీసీ రోడ్లను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ఇతర అవసరాలకు సంబంధించి ప్రాధాన్యతాక్రమంలో అన్నింటిని పరిష్కరిస్తామన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 18 మంది లబ్ధిదారులకు నివేశనస్థలాల పట్టాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీవో నేతాజీ, ఏవో కాశీవిశ్వనాథ్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రమణ, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, లేళ్ల శ్రీధర్, బొడ్డు సుబ్బారావు, గవిని వెంకట్రావు, ఆతిన వెంకట్రావు, పులి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయపడటం అభినందనీయం

చీరాల, జనవరి 29: విద్యార్థులు చదువుకునేందుకు ప్రోత్సాహకంగా స్కాలర్‌షిప్ రూపేణా ఆర్థికసాయం అందించటం అభినందనీయమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం చీరాల, పేరాల పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ హైమా సుబ్బారావు, డాక్టర్ తాడివలస దేవరాజ్ తదితరులు సంఘసేవలను వివరించారు.

కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాచవరపు వెంకటేశ్వర్లు, వల్లూరి వెంకటస్వామి, ఆతిన బోసుబాబు, కలవకూరి సుబ్బారావు, వల్లూరి శ్రీనివాస్, శ్రీను, బి.ప్రసన్నారావు, కలవకూరి బాలశంకర్, మేడిశెట్టి సత్యనారాయణ, కొరవడ సత్యనారాయణ, పట్నాల శివ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బాధిత కుటుంబసభ్యులను ఓదార్చిన భువనేశ్వరి



సింగారావు భార్య పార్వతికి రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి. పక్కన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, విజయకుమార్



యద్దనపూడిలో మృతుని కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న భువనేశ్వరి

చిననందిపాడు(పర్చూరు), జనవరి 30: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం పర్చూరు నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక మృతి చెందిన పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన పార్టీ అభిమాని ముప్వా సింగారావు నివాసానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. భువనేశ్వరి చూసి సింగారావు భార్య ముప్వా పార్వతి, తల్లి మస్తానమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. పార్వతి కన్నీటిని తుడుస్తూ భువనేశ్వరి ఓదార్చారు. అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీకి వీరాభిమానిగా ఉండే వారని, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక తల్లిడిల్లిపోయాడని భువనేశ్వరి వద్ద భర్త గోడును వివరించింది. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని కాలినడకన తిరుపతి కూడా వెళ్ళాలని పలుమార్లు తనవద్ద ప్రస్తావించినట్టు చెప్పారు. మృతుని తల్లి మస్తానమ్మ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. మృతుని కుమార్తెలు హిమబిందు, కళ్యాణిల కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుని భార్యకు రూ.3లక్షల చెక్‌ను నారా భువనేశ్వరి మృతుని భార్య పార్వతికి అందజేశారు.

తదనంతరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్న మహిళలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిజం గెలవాలి.. నిజమే గెలవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఎమ్మెల్సీ అనూరాధ, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, సర్పంచ్ ముప్వా వెంకటశివరావు, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పూరిమెట్ల జయమ్మ, రాయపాటి సంధ్య, జరుగుమల్లి సంధ్య, సరోజిని, యార్లగడ్డ లక్ష్మీ, పుల్లెల పద్మ, దూళిపల్లి వెంకటస్వామి, కోడూరి శేషబ్రహ్మాచారి, మానం హరిబాబు, మక్కెన శేఖర్, నాయకులు పోట్రు శోభన్, కొల్లా శ్రీనివాసరావు, పోపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం యద్దనపూడి మండల కేంద్రంలో మృతిచెందిన టెక్కెం నాగేశ్వరరావు నివాసానికి వెళ్ళి మృతుని భార్య దేవునిదయ, కుమార్తెలు, హారిక, వెంకటరత్నంను భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. మృతుని పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్నకుమార్తె డిగ్రీ చదువుతుండగా తండ్రి మృతి చెందటంతో చదువును నిలిపి వేసినట్టు తెలిపారు. దీనిపై భువనేశ్వరి స్పందిస్తూ చదువుకు కావల్సిన సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుని భార్యకు రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో భువనేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలు అందరికీ ఆదర్శం



పంగులూరులో మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

పంగులూరు, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ ఆచరించిన శాంతి, అహింస మార్గాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ప్రతినిధులు చిలుకూరి వీరరాఘవయ్య, కాలేషావలి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పంగులూరులోని రోటరీక్లబ్ ప్రాంగణంలో మహాత్ముని విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆర్వీ సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, జేకేసీ, పోలిశెట్టి సీతారామయ్య, ఎనికపాటి శ్రీను, గుడిపూడి రామారావు పాల్గొన్నారు.

గాంధీజీ అహింసామార్గం అనుసరణీయం

చీరాల, జనవరి 29: జాతిపిత మహాత్మాగాంధీ సూచించిన అహింసామార్గం అందరికి అనుసరణీయమని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పలుచోట్ల గాంధీ విగ్రహాలకు, ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక నల్లగాంధీ, తెల్లగాంధీ విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య, ఇతర నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ గాంధీ ఆలోచనను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం సచివాలయం ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పట్టభద్రుల సంఘం ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ వేటపాలెం వచ్చిననాటి సంఘటనను మననం చేశారు. స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయంలో గాంధీ చేతికర్రను నేటికి గుర్తుగా భద్రపరిచారన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం ప్రతినిధులు ప్రత్తి వెంకటసుబ్బారావు, కోటిస్వామి గుప్తా, రావి మస్తాన్‌రెడ్డి, చుండూరు రవి, సచివాలయం-2 సెక్రటరీ శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో.. అద్దంకిటౌన్, జనవరి 30: మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనితా అద్దంకి ఆధ్వర్యంలో పాత గాంధీ బొమ్మ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో వాసవి ఐఈసీ ఆఫీసర్ ఊటుకూరి ఉమాఅన్నపూర్ణ, వాసవి క్లబ్ అధ్యక్షుడు వుడుత్తు వెంకట ఆదినారాయణ, కార్యదర్శి పాపరావు, అనిల్ కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సెక్రటరీ అంజలి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, జనవరి 30: మండలంలో మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలో మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కోట శివరామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.

కార్యక్రమంలో బయ్యా జ్యోతి, వలివేటి నాగజ్యోతి, మోటుమర్రి శేషకుమారి, అమరా సుబ్రమణ్యం, గెల్లి లక్ష్మీనారాయణ, పి.పవన్ కుమార్, అమరా శ్రీనివాసులు, వలివేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో నల్లగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు కొండయ్య, తదితరులు

రాష్ట్రంలో మైనింగ్ మాఫియా

- కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టారు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, జనవరి 30: ఐదేళ్లుగా రాష్ట్రంలో మైనింగ్ మాఫియాను నడుపుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టిన ఏపీ స్టేట్ డీఎంజీ డి.వెకటరెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డిమాండు చేశారు. మంగళవారం ఉదయం మార్టూరులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్ పరిశ్రమలో నెల్లూరు, కృష్ణాజిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రానైట్ పరిశ్రమలో విజిలెన్స్ అధికారులతో మాట్లాడిన అనంతరం ఏలూరి సాంబశివరావు విలేకరులతో మాట్లాడారు. అధికారులను అడ్డం పెట్టుకొని, ప్రవేటు వ్యక్తులతో గ్రానైట్ పరిశ్ర మల యజమానులను ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించి మామూళ్ల వసూలు చేసిన డీఎంజీపై విచారణ చేపట్టాలన్నారు. మైనింగ్ విజిలెన్స్ అధికారులతో గ్రానైట్ పరిశ్రమలపై తనిఖీలు పేరుతో యజమానులను బ్లాక్ మెయిలింగ్‌చేసి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు.

మార్టూరు, బల్లికురవ, చీమకుర్తి, ప్రకాశం జిల్లాలో పేరుగాంచిన గ్రానైట్ పరిశ్రమను నిర్వీ ర్యం చేసి ఎంతోమందికి ఉపాధిని కల్పించిన గ్రానైట్ పరిశ్రమను అధికార పార్టనాయకులు తమ స్వార్థానికి ఉపయోగించుకొని కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. మార్టూరు ప్రాంతంలో పందిళ్లపల్లికి చెందిన 50 మంది యువకులు రోజూ గ్రానైట్ వసూళ్ల చేపడుతున్నారన్నారు. గ్రానైట్ పరిశ్రమను బతికించుకోవాలన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అధికారులు వైసీపీ నేతలకు తలొగ్గి తప్పుడు పనులు చేస్తే తగిన గుణపాఠం చెప్పే సమయం త్వరలోనే ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి హెచ్చరించారు.